# మనసు చెప్పిన తీర్పు

– చల్లా సత్యవతి, Matawan, NJ

అరుణాదేవి వారం రోజులుగా జ్వరంతో మంచం మీదనే గడుపుతున్నది. ఈరోజే కళ్ళు తెరిచి మెల్లగా కిటికీ తలుపులు తెరిచింది. ఉదయభానుని లేతకిరణాలు నవ్వుతూ పలకరిస్తున్నాయి. గేటు పక్కనే వున్న ఎర్ర గన్నేరు చెట్టునిండా పూలగుత్తులు అందాలు ఒలకబోస్తున్నాయి. దూరంగా బాదం చెట్టుమీద చిన్న పక్షి గూడు కట్టుకున్నట్లున్నది. మాటిమాటికీ తన బుజ్జిపిల్లలను చూసుకునేందుకు తల్లి అటూ ఇటూ ఎగురుతూ గోలగోలగా అరుస్తున్నది. అరుణకు నవ్వు వచ్చింది. ఈ ప్రకృతిలో ప్రతీ ప్రాణీ తన సంతానాన్ని ఎంతగా ప్రేమించి పోషిస్తుందోకదా అని అనుకున్నది. ప్రతి రోజూ లేవగానే తోటలోని ఈ దృశ్యాలన్నీ ఎంతో ఆసక్తితో చూసి ఆనందించేది. ఈవేళ చాలా నీరసంగా అనిపించి కళ్ళు మూసుకున్నది. వేడివేడిగా ఏదైనా త్రాగాలనిపించి, వకుళను పిలవాలనుకుంటూండగానే ఎలా తెలిసిందో తానే వచ్చింది నవ్వుతూ ‘అక్కా లేచావా?‘ అంటూ.

"అమ్మయ్య ఈవేళ ముఖమెంతో తేటగా వుంది. జ్వరం పూర్తిగా తగ్గినట్లున్నది. అందుకే రాత్రంతా బాగా నిద్ర పోయావు" అంటూనే లోపలికి వెళ్ళి, రెండు నిమిషాలలో వేడివేడి హార్లిక్సు తెచ్చి, తన ప్రక్కనే కూర్చుని, ఆప్యాయంగా త్రాగించింది.

‘ఈమెకు నేనంటే ఎంత అభిమానమో, కన్నకూతురుకంటె ప్రేమగా సేవలు చేస్తున్నది. నేను ఈమెకు చేసిన ప్రత్యేక ఉపకారాలేమీ లేవు‘ అనుకుంటుంటే ఆమె మనస్సు ఆర్ద్రమైంది. కళ్ళు చెమర్చాయి. వకుళ నొచ్చుకుంటూ, "అదేమిటక్కా, కన్నీళ్ళు పెట్టుకుంటావు నీ జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. ఏమీ బెంగ పడకు. కాస్త చారూ, అన్నం తింటే నీరసమంతా మాయమై మాఅందరికీ పనులు పురమాయిస్తావు" అంటూ ఉత్సాహపరిచింది. అరుణ కూడా నవ్వు తెచ్చుకొని వకుళ భుజం మీద చేయి వేసింది.

అరుణకు గతమంతా సినిమా రీలులాగా కదలసాగింది. ఈ వకుళ తల్లి వరలక్ష్మి తన తండ్రికి పినతల్లి కూతురు. భర్త తలకు మించిన ఖర్చులూ, దానధర్మాలు చేసి ఆస్తినంతా పోగుట్టుకొని, ఆ బెంగతో ఒకరోజు హఠాత్తుగా కన్ను మూసాడు. తల్లీ, ఆరేళ్ళ వకుళా అనాథలుగా మిగిలారు. తాముంటున్న ఇల్లు అప్పులు తీర్చడానికి సరిపోయింది. దగ్గర బంధువులు ఆపదలో ఆదుకొని కొద్ది రోజులు పోషించారు. కాని పూర్తి బాధ్యత వహించే స్తోమత వారికి లేదని గ్రహించి, ఉదారుడైన తన తండ్రి వారిని చేరదీసి, తన ఇంట్లో ఆశ్రయమిచ్చాడు. మొదట్లో తన తల్లికి అంత యిష్టం లేకపోయినా, క్రమంగా వరలక్ష్మి మంచితనం, కార్యదక్షత తెలుసుకొని అభ్యంతరం చెప్పలేదు. ఎప్పుడూ వచ్చే పోయే బంధుమిత్రులతో నిండుగా వుండే తమ ఇంట్లో వరలక్ష్మి సహాయం ఎంత అవసరమో గ్రహించింది. ఇల్లు శుభ్రంగా వుంచడం, పనివాళ్ళతో చక్కగా చేయించుకోవడం సమర్ధవంతంగా చేసే ఆమె విలువ తెలిసివచ్చింది.

క్రమంగా ఆ తల్లీకూతుళ్ళు కుటుంబసభ్యులుగా మారేరు. అరుణకంటే వకుళ నాలుగేళ్ళు చిన్నది. మల్లెపూవులాగ శుభ్రంగా వుంటుంది. ఆపెదవులపై నిరంతరం చిరునవ్వు మెరుస్తూంటుంది. ఎందుకో అరుణకు ఆమెపై ఒకరకమైన అసూయ, చిన్నచూపు అలవడ్డాయి. ఆమె పేరు కూడా తన పేరుకంటే గొప్పగా అనిపించి, ఒకసారి తెలుగు పంతులుగారిని "వకుళ అంటే అర్థం ఏమిటండీ?" అని అడిగితే, ఆయన నవ్వుతూ "అది చాలా మంచి పేరమ్మా. వకుళమాల అంటే బొగడపూలదండ. ఆపూల పరిమళం అతిమనోహరం. పైగా, పూలు ఎండిపోయినా సువాసన అలాగే వుంటుంది. ఆవిధంగానే ఆ అమ్మాయి స్నేహపరిమళం కూడా నశింపదు" అన్నారు.

ఆ మాటలు అరుణ మనస్సును ఇంకా మండింపజేశాయి. ఏదో వంక పెట్టుకొని ఆమెతో గిల్లి కజ్జాలు పెట్టుకొనేది. కానీ వకుళ అమాయకంగా అవేమీ పట్టించుకోకుండా "అక్కా, అక్కా" అంటూ కూడా కూడా తిరిగేది. అరుణ తండ్రి ఆమెను స్కూలులో జేర్పించాలని ప్రయత్నం చేయబోతే తల్లి స్వార్ధంతో పడనివ్వలేదు. ఒకసారి చిన్నతనం కొద్దీ హార్లిక్స్ సీసా నుండి స్పూనుతో తీసుకుని తింటుంటే అరుణకు పట్టుబడింది. అంతే, చెంప ఛెళ్ళుమన్నది. ఏడుస్తున్న కూతురిని తల్లి వచ్చి తీసుకునివెళ్ళిపోయింది. అరుణ తల్లి ఇదంతా చూసి కూతురిని గట్టిగా చివాట్లేసింది. "కాస్త హార్లిక్స్ కోసం ఎందుకు కొట్టావు? ఇప్పుడు వాళ్ళమ్మ కోపగించి వెళ్ళిపోతే నాకెంత కష్టమో గ్రహించావా? ఇంత ఇంటిని చక్కగా సమర్ధిస్తోంది. ఇకెప్పుడూ అలా చేయకు. తెలిసిందా" అని మెత్తగా మందలించింది.

పేదవారి అభిమానాలు ఎంతసేపుంటాయి. సాయంత్రం వరలక్ష్మి మామూలుగా వచ్చి తన పనులు చూసుకోసాగింది. మర్నాటికి వకుళ కూడా మామూలుగా మాట్లాడటం మొదలుపెట్టింది.

వకుళకు ఇరవైఏళ్ళ వయసులో బంధువుల సహాయంతో పెళ్ళి జరిగింది. కానీ ఆమె భర్త దుర్వ్యసనాలకు బానిసై, అనారోగ్యంపాలై భార్యను హింసించసాగాడు. ఆ బాధలు భరించలేక తల్లి వద్దకు వచ్చేసింది. కాలక్రమేణా తల్లినికూడా కోల్పోయిన వకుళ అరుణాదేవి ఇంటిమనిషిగా కలిసిపోయి అందర్నీ తన ప్రేమతో ఆకట్టుకొన్నది. అరుణ కలవారిబిడ్డ. తండ్రి లక్షలార్జించి కూతురిని అతిగారాబంగా పెంచి, మంచి చదువు చెప్పించాడు. అరుణకూడా తెలివైంది. కష్టపడి చదివి ఎం.ఎ. ఫస్టుక్లాసులో పాసయి, స్థానిక కళాశాలలో లెక్చరరు అయింది. భర్త మంచి ప్రాక్టీసు గల లాయరు. తండ్రి ఇచ్చిన రెండంస్థుల

భవనంలో సుఖజీవితం. కొడుకు అశోక్ ఇంజనీరై, తాను కోరుకున్న సౌమ్యను పెళ్ళిచేసుకొని బొంబాయిలో మంచి పదవిలో వుంటున్నాడు. ప్రతీ ఏడూ క్రిష్టమస్ సెలవులకు స్వంతవూరు వచ్చి తల్లితో చెల్లెలితో గడిపి వెళ్తూంటాడు. అరుణాదేవి కూతురు అనుపమ డిగ్రీ పూర్తిచేసి, పై చదువులు ఇష్టంలేక తల్లి ఇష్టప్రకారంగానే పెళ్ళిచేసుకుని తల్లితోనే వుంటున్నది. తండ్రి గతించాక, వ్యవహారాలన్నీ చాకచక్యంగా చూసుకుంటూ చక్కటి గృహిణి అయింది. అరుణాదేవికి కూడా తన స్వంత ఇంట్లో కూతురు, మనుమలతో సుఖవంతమైన జీవితమే లభించింది. అయినా ఆమె మనసులో ఏదో అసంతృప్తి. ఒకవిధమైన అపరాధభావం బాధిస్తూంటుంది. ఇన్నాళ్ళూ కారణం తెలియలేదు. ఈ జ్వరం వచ్చి తగ్గినప్పటినుండీ అంతరాత్మ తను చేసిన తప్పులను చూపిస్తూ నిలదీస్తోంది. ఆ ప్రశ్నలకు తట్టుకోలేక చాలా దిగులు కల్గుతోంది. తానెన్నడూ ఎవరినీ దయతోనూ, ప్రేమగానూ ఆదుకోలేదు. ఎన్నో అవకాశాలున్నప్పుడు కూడా అహంకారంతో ఎవరికీ సహాయం చేయలేదు. పైగా వారిని నిర్దయతో తూలనాడేది. అన్నీ ఇప్పుడు గుర్తు వస్తున్నాయి. పశ్చాత్తాపం ఆమెను ఎంతగానో భాధిస్తోంది. కాని ఎం లాభం?

ఒకసారి పనిమనిషి రమణమ్మ గుమ్మందగ్గర నిలబడి దీనంగా అడిగింది "నాకూతురు పురుటికి వచ్చిందమ్మా. రెండు పాత చీరలిప్పించండి. చలికాలం వెళ్ళిపోతుంది" అని దీనంగా అడిగితే తానేమీ మాట్లాడకుండానే వెళ్ళి పోయింది. క్లాజెట్టులో డెబ్భై, ఎనభై చీరలు వ్రేలాడుతున్నాయి. ఏం లాభం తన చేతితో ఒక్కటి కూడ ఇచ్చి, ఆమె ముఖంలో ఆనందం చూడలేకపోయింది. పాపం తోటమాలి రంగయ్య చలిలో చొక్కా ఐనా లేకుండానే పని చేస్తూంటాడు. ఎన్నో దుప్పట్లు, శాలువాలూ వున్నా ఒక్కటైనా అతనికివ్వాలని తనకెప్పుడూ తోచనేలేదు. ఈ ఆలోచనలలోనే చిన్న కునుకు పట్టింది. కలో నిజమో తెలియలేదు. కారు డ్రైవరు నూకరాజు తన చిన్నకొడుకుని తీసుకొనివచ్చి దణ్ణంపెట్టాడు. తాను నిర్లక్ష్యంగా ఏమిటన్నట్లు చూసింది. మొహమాటంగానే, "వీడికి S.S.C. లో మంచి మార్కులొచ్చాయమ్మా. అందరూ కాలేజీలో జేర్చమంటున్నారు. మాష్టర్లు కూడా జేరాక మీవాడికి స్కాలరుషిప్పు తప్పకుండా వస్తుందనికూడా అంటున్నారు. కాని ముందుగా వెయ్యిరూపాయలుదాకా డిపాజిట్టు కట్టాలిట. తమరు దయతలచి సహాయం చేస్తే క్రమంగా నాజీతంతో తీర్చుకుంటాను. తర్వాత వాడి అదృష్టంవల్ల మంచి ఉద్యోగం దొరకవచ్చును." అని ఆశగా తనవైపు చూశాడు. పిల్లవాడు బిక్కమొహంతో నుంచున్నాడు. "ఏం? డిగ్రీ లేకపోతే ఉద్యోగాలు దొరకవా? టైపు నేర్పించు. తక్కువ ఖర్చుతోనే అవుతుంది. ఏఅప్పులూ చెయ్యనక్కరలేదు. అత్యాశలకు పోవడంకన్నా, ఉన్నదాంట్లోనే తృప్తిపడటం నేర్పించు నీకొడుక్కి" అనేసి చెప్పులు వేసుకుని బైటకు నడిచింది. తండ్రీ కొడుకులు ముఖాలు వేలాడేసుకొని వెళ్ళిపోయారు. ఆకొంచెం డబ్బూ సర్దటం తనకేమీ కష్టం కాదు. సమయానికి ఆ సొమ్ము అందితే, అతను డిగ్రీ చదివి ఇంకా పై చదువులు కూడా చదివేవాడేమో! ఇదంతా పూర్వం జరిగిన సంఘటన జ్ఞాపకం అన్నమాట. అరుణకు పూర్తిగా మెలకువ వచ్చాక కళ్ళునులుపుకొని చూసింది. అంతా మామూలుగానే వుంది. చాలా నీరసంగానూ, ఆందోళనగాను అనిపించింది. "వకుళా, వకుళా" అంటూ గట్టిగా పిలిచింది. ఆమె పరుగెత్తుకుంటూ వచ్చి భుజంపై చేయివేసి "ఏమిటక్కా! అంతగా ఉలికిపడ్డావు. ఈ జ్వరంతో నీమనసు కూడా చెదిరిపోయింది. పీడకలేమైనా వచ్చివుంటుంది. అయినా కలలు నిజాలు కావుకదా! రేపు శుక్రవారం అమ్మవారిగుడిలో సహస్రనామార్చన చేయిద్దాం. ఆతల్లి దయతో అన్నీ బాగుంటాయి." కాస్సేపు ఊరడించి పళ్ళరసం త్రాగించింది. అరుణ ఎటో చూస్తూ ఆమాటలు పట్టించుకోకుండా "చూడు వకుళా! నాముత్యాలన్నీ ఎలా జారి పోతున్నాయో! అన్నీ పోగుచేసి నాకివ్వు" అంది. వకుళ పకపకా నవ్వసాగింది. "నీకేదో భ్రమ కల్గుతోందక్కా. నీముత్యాలేవీ అసలు దొర్లిపోవటంలేదు. చక్కగా నీమెళ్ళోనే మెరుస్తున్నాయి. చూడు" అంటూ ఆమె మెడలోని ముత్యాలహారాన్ని తీసి దోసిట్లో పోసింది. అరుణ ఎంతో అపురూపంగా కళ్ళకద్దుకొని "నిజంగా తెగిపోలేదా? ఈ ముత్యాలెంత విలువైనవనుకున్నావు. మా అమ్మ నా పదహారో పుట్టినరోజు నాకు చేయించింది. ఒక్క రోజు కూడా తీయలేదు. చేజారిపోయాయనుకున్నవి దోసిట్లో పోశావు. ఇంక ఇవి నీవే. ఈఅక్క జ్ఞాపకార్థంగా నీమెడలో వుండనీ" వకుళ నిశ్చేష్టురాలై అలాగే నిలబడి పోయింది. తరువాత అరుణ చాలా సేపు తనలో తానే ఆలోచించుకుంటూ వుండిపోయింది. చటుక్కున ఆమె మనసులో మెరుపు మెరిసినట్లయ్యింది. క్రమంగా ఆమె ముఖం కాంతివంతమైనది. వకుళను ఉత్సాహంగా పిలిచి "నాదిగులు, బెంగ అన్నీ మాయమయ్యే ఉపాయం తట్టింది. నీకిప్పుడు చెప్పను. రేపు వివరంగా అన్నీ తెలుస్తాయి. ప్రస్తుతం చాలా ఆకలిగా వుంది. చక్కటి వంకాయ వేపుడు, కొబ్బరి పచ్చడీ చేయి. ఇద్దరం కలిసి భోజనం చేద్దాం."

అరుణ తన గదిలో చాలా సేపు ఏదో వ్రాసుకొంటూ వుండిపోయింది. చాలా రోజుల తర్వాత వారిద్దరూ సంతృప్తిగా, నవ్వుకొంటూ భోజనాలు చేశారు. అరుణ ఆరాత్రి ఏ కలతా లేకుండా హాయిగా నిద్ర పోయింది.

ఉదయాన్నే సుర్యోదయమవగానే లేచి, తిన్నగా తన పూలతోటలోనికి వెళ్ళి అన్ని మొక్కలను పలకరించింది. నాలుగు గులాబీలను, కొన్ని క్రోటను ఆకులను కోసి, ఫ్లవరు వాజులో చక్కగా అమర్చింది. నవ్వుతూ, చూస్తూ నిలబడి పోయిన వకుళ వద్దకు వెళ్ళి" మన అనూ, పిల్లలూ కనిపించరేం? ఎక్కడికెళ్ళారు?" "వాళ్ళంతా బొంబాయి వెళ్ళారక్కా. మూడురోజులైంది. నీకు చెప్పే వెళ్ళారు. మరిచిపోయావు. క్రిష్టమసు వస్తోంది కదా! అశోక్, పిల్లలూ అందరూ రేపు వస్తున్నారు. ఆ ఏర్పాట్లే చేయిస్తున్నాను. పిల్లలిష్టపడ్తారని మైసూర్

పాకు, జంతికలు చేసాను. ఇంక మేడమీద గదులు సర్దించాలి." అరుణ నవ్వుతూ వింటోంది. ఈ వకుళకు అలసటన్నది వుండదుకాబోలు. ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా, పసిపిల్లలాగా వుండటం దేవుడిచ్చిన వరం అనుకుంటాను. అదృష్టవంతురాలు. మా తెలుగు పంతులుగారు చెప్పినట్లు ఈమె వున్నచోట ఆనందపరిమళాలు వెదజల్లుతాయి" అనుకుంటూ తన గదిలోకెళ్ళి ఏవో కాగితాలు సర్దసాగింది.

మధ్యాహ్నం లాయరు మధు వచ్చి అరుణ ప్రక్క కుర్చీలో కూర్చుని చనువుగా "ఏం జరిగిందాంటీ.. అర్జెంటుగా రమ్మని ఫోను చేసావు. సంగతేమిటంటే చెప్పలేదు. నీకు జ్వరమొచ్చి తగ్గిందని వకుళ చెప్పింది. ఈవేళో రేపో వద్దామనే అనుకుంటున్నాను. నువ్వే రప్పించావు. ఏమిటి విశేషం?" అంటూ ఆమె భుజం మీద చేయి వేశాడు. మధు తలితండ్రులు, అరుణ వాళ్ళు ప్రక్క ప్రక్క ఇళ్ళలో వుండేవారు. మధు, అశోక్ ఒకే వయసు, ఒకే క్లాసులో చదువుకునేవారు. దురదృష్టవశాన మధు తల్లి హటాత్తుగా పోవడం వలన, అరుణకు మరీ దగ్గరయ్యాడు. పెద్దవారయ్యాక మధు మద్రాసులోనూ, అశోక్ బొంబాయిలోనూ స్థిరపడినా ప్రతీ సంవత్సరం అంతా కలవడం, కలిసే పండుగలు చేసుకోవడం అలవాటు. అంచేత రెండువారాలకొకసారైనా వచ్చి ఆంటీని పలకరించి వెళ్తాడు. తన కష్టసుఖాలు పిల్లలకంటే ఎక్కువగా మధుకే చెప్పడం, అతని సలహాలు తీసుకోవటం అరుణకు అలవాటు. అందుచేతనే అతనికి ఫోను చేసి రప్పించింది.

వకుళ టీ, బిస్కట్లు తెచ్చి బల్లపై పెట్టి, మధుని పలకరించి వెళ్ళబోయింది. అరుణ ఆమెను ఆపి, "నువ్వు నా ప్రక్కనే వుండాలి. నీకు అన్ని విషయాలు తెలియాలి" అంటూ ఆమెను తన ప్రక్క కుర్చీపై కూర్చోమని అసలు విషయాన్ని చెప్పనారంభించింది. "మధూ ! నీకు నాపై వున్న గౌరవాభిమానాలు నాకుతెలుసు. కనుక నీపై ఒక బాధ్యతను పెడుతున్నాను. అది నిర్వహించే సమర్థత నీకున్నదని కూడా తెలుసును. చెప్పమంటావా" అని మధువైపు తిరిగింది. "అదేమిటి ఆంటీ, నీ ఉద్దేశాలు నాతో చెప్పడాన్కి ఏమాత్రం ఆలోచించనక్కరలేదు. నీవు నాపై మోపిన బాధ్యతను నాకు చేతనైన విధంగా తప్పక తీరుస్తాను. నీకోరికలు తీరకపోవడం అంటూ వుండదు." అన్నాక అరుణ మొదలుపెట్టింది. "మధూ ! నాకీమధ్య శారీరకంగానే గాక, మానసికంగా కూడా బాగుండటంలేదు. జ్వరం వచ్చి తగ్గాక ఎన్నో ఆలోచనలు వస్తున్నాయి. నాలోని అంతరాత్మ మేలుకొని, క్షణం క్షణం నిలదీస్తున్నది. నాకు మంచే జరిగింది. ఇదివరలో నాకున్న స్వార్థం, అసమర్థత అర్థమయ్యాయి. నాజీవితంలో అన్ని సౌఖ్యాలున్నా నాకు సంతృప్తి లేదు. సంతోషం లేదు. ఎందుచేతనో ఇపుడిపుడే తెలుస్తోంది. నిస్వార్థంగా ఎవరికీ ఉపకారాలు చేయలేదు. అహంకారంతో అవకాశాలను చేజేతులా వదులుకున్నాను. అన్నీ నాచేజారిన ముత్యాలయ్యాయి. అవన్నీ తిరిగి దిద్దుకొనే అవకాశం లేకపోయినా ఇక ముందైనా నాచేతులతో కొన్ని సత్కార్యాలు చేసి ఆనందాన్ని పొందాలనే ఈ ప్రయత్నం. నేను చెప్పబోయే విషయాలను నేను వ్రాసినట్లుగానే ఒక వీలునామా తయారుచేయాలి. నేను చదివి సంతకం పెడతాను. నా స్థిరాస్తులు నీకు తెలిసినవే. రెండకరాల తోటలోనున్న ఈ ఇల్లు నాకూతురికి, బొంబేలోవున్న మూడుగదుల ఫ్లాటు, సిటీకి దూరంగావున్న స్థలం నాకొడుక్కి చెందాలి. ఈఊళ్ళోనే ఈఇంటికి దగ్గరలోనున్న రెండుగదుల ఫ్లాటు, ఇండియన్ బాంకులోవున్న సుమారు మూడులక్షల సొమ్ము నా ప్రియమైన వకుళకు చెందాలనీ వ్రాయి" అని సాభిప్రాయంగా ఆమె వైపు చూసింది. ఆమె ముఖంలో ఏ భావం వ్యక్తమవలేదు. "హైదరాబాదులోనూ, బొంబాయిలోనూ వివిధబాంకులలో నాపేరవున్న డిపోజిట్లు, షేర్లు రొక్కం నాతదనంతరం అవసరంగల పేద ప్రజలకు వినియోగించాలి. చదువుకునేందుకు ఆర్థికంగా అవకాశాలులేని బాలబాలికలకు, వృద్ధాప్యంలో ఆదుకునేవారు లేని పేదవారికి సహాయపడే సంస్థలు చాలానేవున్నాయి. అలాంటి వాటికి విరాళాలుగా యిస్తే నాధనం సద్వినియోగం అవుతుంది. నేను మీకు చెప్పాలనుకున్న విషయాలన్నీ చెప్పేశాను. ఇక అమలుపరచడం మధుకి అప్పచెప్తున్నాను" అంటుంటే అరుణ స్వరం గద్గదమైంది.

మధు చప్పున లేచి వచ్చి ఆమె చేతులు రెండూ పట్టుకొని, "ఆంటీ నీకోరికలూ, ఉద్దేశాలు ఎంతో ఉదాత్తంగా వున్నాయి. నీవు చెప్పిన విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని వరుసగా వ్రాసి రేపే తీసుకొని వస్తాను. నువ్వు సంతకం పెట్టవచ్చును. ధనవంతులలో కొందరైనా నిన్ను ఆదర్శంగా తీసుకుంటే మన సమాజం ఎంతో వృద్ధిచెందుతుంది. నిన్ను చూస్తే నాకు గర్వంగావుంది" అన్నాడు. అంతవరకు నిశ్శబ్దంగా ఆశ్చర్యంతో చూస్తున్న వకుళ కన్నీళ్ళతో అరుణను చుట్టేసింది. "దిక్కూమొక్కూ లేని నన్ను స్వంత చెల్లెలిగా అభిమానించడమే కాక నాపై యింత ప్రేమ, దయ చూపిస్తున్నావు. నీలోవున్న దైవత్వానికి కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను. నీకు చెప్పడానికి మాటలు రావడంలేదు" అని వూరుకుంది. "మాటలు లేకపోవడం కాదు. నీకేమైనా ఉద్దేశాలుంటే సందేహించకుండా చెప్పు". అరుణ మాటలకు కాస్సేపు ఆలోచించి "నీవద్ద నాకున్న చనువుతో ఒక సూచన ఇవ్వాలని వుండక్కా. గత జీవితం తృప్తికరంగా లేదని బాధపడ్తున్నావు కదా. ఇప్పుడు మించిపోయినదేమీలేదు. నువ్వు నూరేళ్ళు ఆరోగ్యంగావుంటావు. ఇకముందు నీకు నచ్చేవిధంగా వినియోగించవచ్చును కదా! నీ శేష జీవితం సార్థకమవుతుంది. అపారమైన తృప్తి కలుగుతుంది. నీప్రక్కనేవున్న నేను కూడా నీ ఆనందాన్ని పంచుకుంటాను కదా" అని తలవంచుకున్నది. అరుణ ఆనందంగా చప్పట్లు కొట్టి "భేష్ వకుళా! నీమంచితనం, తెలివితేటలు బయటపడ్డాయి. నీ సూచన చాలా మంచిది. తప్పకుండా ఆచరిద్దాము" అనగానే గడియారం ఠంగున గంటలు కొట్టింది. గోడపైనున్న పటంలోని శ్రీకృష్ణుడు చిరునవ్వుల వర్షం కురిసినట్టై వాతావరణం ఆహ్లాదకరమైనది. ఓం తత్సత్, సర్వేజనా సుఖినోభవంతు.

***